విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily




సంపుటి : 4 | సంచిక :92 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 22 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## స్వర్ణరథంపై పద్మావతి అమ్మవారు!



కనులపండువగా స్వర్ణరథోత్సవం

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం స్వర్ణరథంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ స్వర్ణరథోత్సవంలో మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో టీటీడీ జేఈఓ డాక్టర్ ఏ.శరత్, ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్ సహా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఫలించిన రాహుల్ పోరాటం

పెల్లెట్ గన్ కాల్పుల బాధితుడికి అండగా నిలబడ్డ లోక్‌సభ విపక్ష నేత

- పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన
- తలొగ్గి, ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు

వివరాలు 7లో..

పెల్లెట్ గన్ కాల్పుల బాధితుడికి న్యాయం జరిగే వరకు కదిలేది లేదంటూ లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పోరాటం ఫలించింది. కేసు నమోదు చేసేందుకు నిరాకరించిన పోలీసుల తీరును నిరసిస్తూ ఆయన ఢిల్లీలోని పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. రాహుల్ దీక్షతో పాటు కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనలతో తీవ్ర ఒత్తిడికి తలొగ్గిన పోలీసులు.. ఎట్టకేలకు దిగివచ్చి బాధితుడి ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



## దేశానికే ఆదర్శంగా ఏపీ జీఎస్టీ ఏఐ మోడల్!

కేసుల పరిశీలన నుంచి కోర్టుల దాకా కృత్రిమ మేధ వినియోగం

వివరాలు 2లో..


- జాతీయ సమన్వయ భేటీలో వెల్లువెత్తిన ప్రశంసలు
- ఏపీ విధానాన్ని అధ్యయనం చేయనున్న ఏడు రాష్ట్రాలు
- ఆరు నెలల్లోనే రూ.743 కోట్ల అదనపు పన్ను గుర్తింపు

## నీకు సీబీఐపై నమ్మకం ఉందా జగన్!



- మెగా డీఎస్సీపై ఆరోపణలు సరికాదన్న మంత్రి సవిత
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్
- వివేకా కేసులో దర్యాప్తును ఎందుకు వద్దన్నావు?
- మా మనోభావాలు దెబ్బతీయొద్దన్న మహిళా టీచర్

వివరాలు 2లో..




## ముగిసిన శకం..

## 'షావుకారు' జానకి కన్నుమూత!

సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం

వివరాలు 7లో..

- పద్మశ్రీ పురస్కార గ్రహీతకు ప్రముఖుల ఘన నివాళి



ఎంపీ అవినాష్ రెడ్డి ఇంట్లో

## రూ.24 లక్షలు సీజ్!

వివరాలు 6లో..

లెక్కచూపని నగదును గుర్తించిన ఈడీ

కీలక పత్రాలు, పరికరాలు సీజ్



## మరో 14 రోజులు జైలులోనే..

- ప్రియాంక మృతి కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు
- సెప్టెంబరు 3 వరకు జస్వంత్, ఆండ్రూలకు రిమాండ్

వివరాలు 2లో..

## చక్కెర ధరలు పెరిగితే ఏంటి.. అందరికీ షుగరేగా..

- చక్కెర రేట్లపై బీహార్ మంత్రి వింత లాజిక్
- ధరల మంటకు ఇథనాల్ కారణం కాదు: కేంద్రం
- దిగుబడి తగ్గడమే ప్రధాన కారణం

వివరాలు 6లో..



## ఈ నాలుగైదు రోజులే కీలకం

ఎస్ఐఆర్ పై వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం

వివరాలు 6లో..






## రైతులను ఎండబెడుతున్న బాబు వైఖరి!

వివరాలు 6లో..

- రాయలసీమపై వివక్ష వీడాలన్న గడికోట శ్రీకాంత్ రెడ్డి



## నేడు కేరళకు పవన్ కళ్యాణ్!

2

వైద్యుల సూచనతో భుజానికి ఆయుర్వేద థెరపీ


విశ్రాంతి తీసుకోకపోవడంతో వాపు, తీవ్ర జ్వరం

పూర్తిగా కోలుకునేందుకే ప్రత్యేక చికిత్స

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్!

**వైద్యుల సూచనతో భుజానికి ఆయుర్వేద థెరపీ**
**ఇటీవల ముంబైలో రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స**
**విశ్రాంతి తీసుకోకపోవడంతో వాపు, తీవ్ర జ్వరం**
**పూర్తిగా కోలుకునేందుకే ప్రత్యేక చికిత్స**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం కేరళ రాష్ట్రానికి వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన, వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్ర చికిత్స అనంతరం పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, కొంతకాలం బహిరంగ కార్యక్రమాలు, విధులకి దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పాలనా బాధ్యతల దృష్ట్యా వారం రోజుల్లోనే పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ముందస్తుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం, వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను నిర్వహించడం చేశారు. విశ్రాంతి లేకుండా వరుస కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల.. శస్త్ర చికిత్స చేసిన భుజం భాగంలో వాపు పెరగడంతో పాటు ఆయనకు తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. దీంతో ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కేరళలో ఈ ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.



# నేడు ఉత్తరాంధ్రలో సీఎం పర్యటన

**అనకాపల్లి, విజయనగరం, విశాఖల్లో బిజీబిజీ**
**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాలుపంచుకోనున్న బాబు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో ఆయన మమేకం కానున్నారు. ఉదయం అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం పదకొండు గంటల ఐదు నిమిషాలకు ఏ.కొడూరు జెడ్పీ హైస్కూలు సమీపంలో నిర్వహించే ప్రజావేదికకు సీఎం చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంటా పదిహేను నిమిషాల వరకు అక్కడే ఉండి ప్రసంగిస్తారు. అనంతరం రెండు గంటల ఇరవై నిమిషాలకు పార్టీ కేడర్ సమావేశానికి హాజరవుతారు. అనకాపల్లి పర్యటన ముగిసిన తర్వాత విజయనగరం జిల్లా ఎస్.కోటకు చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటల ఇరవై నిమిషాలకు ఎమ్మెల్యే కె.లలితకుమారి నివాసానికి వెళ్తారు. అక్కడి నుంచి విశాఖపట్నంలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్తారు. సాయంత్రం ఐదు గంటల ఐదు నిమిషాలకు నోవాటెల్‌లో జరిగే రెండో బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశాలుఉరెండు వేల ఇరవై ఆరుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. ఈ పర్యటన ముగించుకుని రాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.



# షావుకారు జానకి మృతిపై దిగ్భ్రాంతి!

**ప్రముఖ నటి మరణం పట్ల సీఎం చంద్రబాబు సంతాపం**
**సినిమానే ఇంటి పేరుగా మార్చుకున్నారని పవన్ కితాబు**

అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి ఆకస్మిక మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాలుగు వందలకు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో పురస్కారాలు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరమైనా.. ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచిపోతారని ఆయన కొనియాడారు. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కళ్యాణ్**

షావుకారు జానకి కన్నుమూశారని తెలిసి ఎంతో చింతించానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న గొప్ప నటి అని ఆయన కొనియాడారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు నాలుగు వందల చిత్రాల్లో నటించారని, కథానాయికగానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# శ్రీశైలంలో వరలక్ష్మీవ్రతాలు

**శ్రీశైలం,ఆగస్ట్21:** శ్రీశైలం మహా క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి ఉత్తర భాగంలోని చంద్రావతి కల్యాణ మండపంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలను జరిపారు. వేదికపై వరలక్ష్మీదేవి, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాల్లో 1500 మంది మహిళలు పాల్గొని వ్రతాలు నిర్వహించారు. ప్రతి భక్తురాలికి విడివిడిగా కలశాలు ఏర్పాటు చేయించి, శాస్త్రోక్తంగా వ్రతాలను జరిపించారు.

# దేశానికే ఆదర్శంగా ఏపీ జీఎస్టీ ఏఐ మోడల్!

- జాతీయ సమన్వయ భేటీలో ప్రశంసలు
- అధ్యయనం చేయనున్న ఏడు రాష్ట్రాలు
- ఆరు నెలల్లోనే రూ.743 కోట్ల అదనపు పన్ను గుర్తింపు
- కేసుల పరిశీలన నుంచి కోర్టుల దాకా కృత్రిమ మేధ వినియోగం



జీఎస్టీ పన్నుల పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ విధానానికి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఆరవ జాతీయ సమన్వయ సమావేశంలో ఏపీ వాణిజ్య పన్నుల శాఖ తమ నూతన సాంకేతిక నమూనాను ప్రదర్శించింది. ఏపీ రూపొందించిన సమగ్ర ఏఐ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతర రాష్ట్రాలు ఎంతగానో కొనియాడాయి. ఏపీ మోడల్‌ను అధ్యయనం చేసి తమ రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు తమిళనాడు, బిహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, అసోం, మేఘాలయ రాష్ట్రాలు ప్రత్యేక బృందాలను ఏపీకి పంపుతున్నాయి.

**కేసుల ఎంపిక నుంచి కోర్టుల దాకా ఏఐ సేవలు:**

పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, ఆకస్మిక తనిఖీలు, అప్పిలేట్ ట్రిబ్యునల్, హైకోర్టులలో న్యాయ వివాదాల పరిష్కారం వరకు పూర్తి స్థాయిలో ఏఐ వ్యవస్థలను అనుసంధానించిన తీరును రాష్ట్ర పన్నుల విభాగం చీఫ్ కమిషనర్ బాబు ఏ వివరించారు. పన్ను చట్టాలతో పాటు సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులకు చెందిన 22 వేల తీర్పులతో ప్రత్యేక 'లీగల్-ఏఐ ఆఫీసర్ అసిస్టెంట్'ను సిద్ధం చేసినట్లు తెలిపారు. దాదాపు 13,700 కేసుల్లో లీగల్ నోటీసులు, సమాధానాల ముసాయిదాలను తయారు చేయడంలో ఇది అద్భుత సహకారం అందిస్తోందన్నారు. ఏఐ ముసాయిదాను సిద్ధం చేసినప్పటికీ.. తుది నిర్ణయం, డిజిటల్ సంతకం మాత్రం అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు.

**ఆదాయ గుర్తింపులో విప్లవాత్మక మార్పు:**

పాత మాన్యువల్ విధానంతో పోలిస్తే ఏఐ వ్యవస్థ ద్వారా ఆశించిన దానికంటే అద్భుతమైన ఫలితాలు వచ్చాయని అధికారులు గణాంకాలతో సహా నిరూపించారు. కేవలం ఆరు నెలల రిటర్నుల పరిశీలనలోనే రూ.743.43 కోట్ల పన్ను ఎగవేతను పసిగట్టగా, గతంలో ఇది రూ.365.75 కోట్లు మాత్రమే ఉండేది. అలాగే ఒక్కో కేసులో ఆదాయ గుర్తింపు సగటున రూ.3.08 లక్షల నుంచి ఏకంగా రూ.27.63 లక్షలకు పెరిగింది. రానున్న రోజుల్లో పన్ను రీఫండ్లు, రిజిస్ట్రేషన్ల రద్దు, బకాయిల వసూలు ప్రక్రియలకు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నీకు సీబీఐపై నమ్మకం ఉందా జగన్!

- మెగా డీఎస్సీపై ఆరోపణలు సరికాదన్న మంత్రి సవిత
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్
- వివేకా కేసులో దర్యాప్తును ఎందుకు వద్దన్నావు?
- మా మనోభావాలు దెబ్బతీయొద్దన్న మహిళా టీచర్



:మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సవాల్ విసిరారు. తన హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలు బయటపడటంతో, దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ డీఎస్సీపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. డీఎస్సీ అభ్యర్థుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడుతున్న ఆయనకు.. చట్టాలు, సీబీఐ పట్ల నమ్మకం ఉందా అని నిలదీశారు. ఆనాడు సొంత బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తును ఎందుకు వద్దన్నారో చెప్పాలన్నారు. సొంత చెల్లెలు సునీత డిమాండ్‌ను కూడా ఆయన పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తోందని మంత్రి సవిత స్పష్టం చేశారు. డీఎస్సీ అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే డీఎస్సీ అని వ్యాఖ్యానించారు. పెనుకొండలో మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు సాధించిన జ్యోతి, గంగాధర్ ఇళ్లకు శుక్రవారం ఆమె వెళ్లి అభినందించారు. డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగలేదనడానికి ఈ పేద అభ్యర్థులే నిదర్శనమని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలు చేపట్టారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు.

**మా కష్టాన్ని తక్కువ చేయొద్దు..**

తాను ఎంతో కష్టపడి మెగా డీఎస్సీలో రెండు పోస్టులకు ఎంపికయ్యానని మహిళా టీచర్ జ్యోతి తెలిపారు. డీఎస్సీలో అక్రమాలే జరిగితే తనతో పాటే పరీక్ష రాసిన తన తమ్ముడికి కూడా ఉద్యోగం రావాలి కదా అని ఆమె ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలతో తమ కష్టాన్ని తక్కువ చేసి, తమ మనసులను బాధపెట్టొద్దని జగన్‌ను ఆమె కోరారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, బీసీ స్టడీ సర్కిల్ అందించిన కోచింగ్‌తో ఉద్యోగం సాధించానని మరో ఉపాధ్యాయుడు గంగాధర్ సంతోషం వ్యక్తం చేశారు.

# సినీ రంగానికి తీరని లోటు!

**'షావుకారు' జానకి మృతిపై జగన్ సంతాపం**
**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**

ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ అవార్డు గ్రహీత షావుకారు జానకి కన్నుమూయడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నాలుగు వందలకు పైగా చిత్రాల్లో నటించి సినీ ప్రేక్షకుల హృదయాల్లో షావుకారు జానకి చెరగని ముద్ర వేశారని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి దిగ్గజ నటుల సరసన కథానాయికగా నటించడంతో పాటు, ఆ తదనంతరం తల్లి, అమ్మమ్మ, నానమ్మ వంటి విభిన్న పాత్రల్లోనూ తన సహజ నటనతో ప్రేక్షకులను విశేషంగా మెప్పించారని గుర్తుచేశారు. భారతీయ చలనచిత్ర రంగానికి షావుకారు జానకి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని, నంది అవార్డులతో పాటు ఆమె అందుకున్న అనేక పురస్కారాలు ఆ ప్రతిభకు దక్కిన గౌరవాలని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సినీ పరిశ్రమకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# ఉయ్యూరులో డయేరియా లేదు

**ఆస్పత్రిని సందర్శించిన మంత్రి నారాయణ**

**విజయవాడ,ఆగస్ట్21:** ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. అలాగే స్థానిక 5వ వార్డులో డయేరియా సోకిన ప్రాంత ప్రజలతో ఆయన మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఉయ్యూరుతో పాటు పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది డయేరియాతో ఆసుపత్రిలో చేరారని వివరించారు. కేవలం ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాల్టీ పరిధిలో ఉన్నారని పేర్కొన్నారు. వీరందరి ఆరోగ్యం నిలకడగా ఉందని స్పష్టం చేశారు. అయితే ఓ వ్యక్తి ఆగస్టు 17వ తేదీన గుండెపోటు సమస్యతో ఆసుపత్రిలో చేరి మృతి చెందారని మంత్రి నారాయణ తెలిపారు. ఆ వ్యక్తి మృతికి, డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే నీటి లైన్‌కు, ఇతర గ్రామాల్లోని నీటి సరఫరా లైన్లకు సంబంధం లేదని వివరించారు. డయేరియాకు కారణం మున్సిపల్ పైప్ లైన్ కాలుష్యమా?.. లేక ఆర్వో ఎ÷-లాంట్ల సమస్యా? అనేది తేలాల్సి ఉ ఒదని అన్నారు. ప్రాథమిక పరీక్షల ప్రకారం తాగు నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి నారాయణ వివరించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లోని పాత పైప్‌లైన్లను మారిస్తున్నామని చెప్పారు. ఉయ్యూరుకు రూ. 98 కోట్లతో అమృత్ 2.0 కింద పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, జేసీ నవీన్ ఉన్నారు.



# మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు!

- ఐదు నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో ఆపరేషన్
- మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్, బంగ్లాదేశ్ అధికారులకు సమాచారం
- ఆచూకీ దొరికే వరకు వెతుకులాట ఆగదన్న మంత్రి అచ్చెన్నాయుడు

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం ఐదు నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తో పాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్ జనసేన లక్ష్యం.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.




**పెందుర్తి, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**స్థానిక సంస్థల ఎన్నికల్లోను నూరు శాతం స్ట్రైక్ రేట్ తో కూటమి అభ్యర్థులు విజయం సాధించడమే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం పెందుర్తి లోని సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పంచకర్ల రమేశ్ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్థానిక ఎన్నికల కోసం ఇప్పటికే మార్గ నిర్దేశనం చేసారని, ఆ మేరకు అందరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని స్పష్టం చేసారు. ఈ ఎన్నికల్లో ఎక్కడెక్కడ గెలుస్తామో నిర్ణయించుకొని ఆ వివరాలను పవన్ కళ్యాణ్ కి పంపిస్తామని ఆయన కూటమిలో చర్చించి సీట్ల సర్దుబాటు చేస్తారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ అరాచకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ సీట్లు విషయంలో పట్టువిడుపులతో ముందుకు సాగారని, ఇపుడు జనసేనకు ఎక్కువ సీట్లు అడుగుతారని ఆశాభావం వ్యక్తం చేసారు. అయితే సీట్లు అడగడం ముఖ్యం కాదని నూరుశాతం స్ట్రైక్ రేటుతో విజయం సాధించడం జనసేన పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ దఫా స్థానిక ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్, జిల్లా పరిషత్ చైర్మన్ లను ప్రజలే నేరుగా ఎన్నుకునేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిర్ణయించారని, దీని ద్వారా పదవుల్లో ఉన్న వారిని దింపే అవకాశం ఉండకపోవడంతో వారు నిర్భయంగా ప్రజలకు సేవలందిస్తారని స్పష్టం చేసారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షం లేకపోయినా చాలా హుందాగా ప్రయోజనకరంగా సాగాయని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు తెలిపారు. అనేక అంశాల పై కూటమి ఎమ్మెల్యే ప్రభుత్వానికి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టామని వెల్లడించారు. ప్రతిపక్షం చేయాల్సిన పనిని కూటమి ఎమ్మెల్యేలే విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. జగన్ నాయకత్వం లోని వైసీపీకి రాజకీయాలే ముఖ్యం తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టవని విమర్శించారు. ఈ ప్రెస్ మీట్ లో విశాఖ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గండి దుర్గాప్రసాద్, పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ ముమ్మన సతీష్, 94 వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, కోరుకొండ వరహాలు, తనకాల శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 2 న పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు.








**పెందుర్తి, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**జన్మదిన వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు సెప్టెంబరు 2 న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేశ్ బాబు తెలిపారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారని వెల్లడించారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా, సబ్బవరం మండలం, అమృతపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు వెన్నెల నరేశ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్రీడాకారులతో వాలీబాల్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి పెద్ద మొత్తంలో నగదు బహుమతులు, మెమెంటోలు అందచేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే రమేష్ బాబు తెలిపారు.
దీనికి సంభందించి శుక్రవారం సుజాతనగర్ క్యాంప్ కార్యాలయంలో ప్రచార కర పత్రాలను జనసేన నాయుకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసైనికులకు పండుగ లాంటిదని, దీనికోసం చిన్న కార్యకర్త నుండి పెద్ద నాయకుల వరకు అందరం ఎదురు చూస్తుంటామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే రమేశ్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గండి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు సబ్బవరపు రవి, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ ముమ్మన సతీష్, గల్లా శ్రీనివాస రావు, పిల్లా జగన్ మోహన్ పాత్రుడు, తనకల శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వర రావు, తదితర సబ్బవరం మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

# బండ్ల గణేష్ కూతురిని, అల్లుడుని ఆశీర్వదించిన ఎమ్మెల్యే పరిటాల సునీత.

కుమార్తె, అల్లుడి కి ధర్మవరం పట్టు వస్త్రాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పరిటాల రవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న బండ్ల గణేష్.



**హైదరాబాద్, ఆగస్ట్ 21:** సినీనటుడు, నిర్మాత బండ్ల గణేష్ నివాసానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లారు. గత ఆదివారం బండ్ల గణేష్ కుమార్తె జనని, అల్లుడు సూర్య తేజ వివాహం ఘనంగా జరిగింది. వివాహానికి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ హాజరయ్యారు. వివాహానికి హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే సునీత శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని బండ్ల గణేష్ నివాసానికి వెళ్లారు. గణేష్ దంపతులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. నూతన వధూవరులకు ఆమె ధర్మవరం పట్టువస్త్రాలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం కుటుంబసభ్యులతో ఆత్మీయంగా గడిపారు. శ్రీరాములయ్య సినిమా సమయం నుంచి బండ్ల గణేష్ కు పరిటాల కుటుంబంతో అనుబంధం ఉంది. ఆ సినిమాలో నటించిన బండ్ల గణేష్ పరిటాల రవితో సన్నిహితంగా ఉండే వారు. ఆ రోజులను గణేష్ మరోసారి గుర్తు చేసుకున్నారు. పరిటాల రవితో అనుబంధాన్ని మరువలేనిదని గణేష్ అన్నారు.

# ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన నూకాంబిక.







**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా నూకాంబిక అమ్మవారికి వైభవంగా ధనలక్ష్మి అలంకరణ.
శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా అనకాపల్లి పట్టణం లోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి విశేషంగా ధనలక్ష్మి అలంకరణ నిర్వహించారు.
ఈ సందర్భంగా నూకాంబిక అమ్మవారిని సుమారు రూ. 10 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అత్యంత వైభవంగా అలంకరించారు. ధనలక్ష్మి స్వరూపంలో కొలువు దీరిన అమ్మవారిని దర్శించు కునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.
ఈ విశేష ధనలక్ష్మి అలంకరణ కార్యక్రమానికి కన్యకా పరమేశ్వరి దేవస్థానం శ్రీహరి భజన మండలి (కోలాటం టీం) బొగ్గారపు సీత, బొగ్గారపు విశాలాక్షి, బృందం తమ అమూల్య మైన సహాయ సహకారాలను అందించారు. వారి సేవాభావాన్ని దేవస్థానం పాలకవర్గ సభ్యులు, అధికారులు అభినందించారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఆలయ సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి, కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూకాంబిక అమ్మవారి కృపాకటాక్షాలతో భక్తులందరికీ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సర్వ శుభాలు కలగాలని దేవస్థానం తరపున ఆకాంక్షించారు.

## ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ తల్లి శ్రావణమాస తిరునాళ్లు.





**గన్నవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**గన్నవరంలో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి శ్రావణమాస తిరునాళ్లు శుక్రవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి.
ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించి, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. లక్ష్మీ తిరుపతమ్మ తల్లి చల్లని కరుణా కటాక్షాలు ప్రజలందరి పై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ద

## భక్తుల సౌకర్యమే లక్ష్యంగా ఇంద్రకీలాద్రి పై ఆధునిక వసతులు.

రూ.52.50 కోట్లతో నిర్మించిన అన్నప్రసాద సదనం, మహా ప్రసాద భవనాల ప్రారంభం.



**విజయవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 21:** ఇంద్రకీలాద్రి పై కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన కనకదుర్గ అన్నప్రసాద సదనం, దుర్గాభవానీ మహా ప్రసాద (లడ్డూ పోటు) భవనాలను శుక్రవారం ప్రారంభించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కోమారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, ఆలయ ఈఓ సీనా నాయక్, దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని నూతన భవనాలను ప్రారంభించారు. భక్తులకు మరింత మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రూ. 26 కోట్ల వ్యయంతో కనకదుర్గ అన్నప్రసాద సదనం, రూ. 26.50 కోట్ల వ్యయంతో దుర్గాభవానీ మహా ప్రసాద భవనం నిర్మించారు. ఈ నూతన వసతులు భక్తులకు మరింత సౌకర్యవంత మైన సేవలను అందించేందుకు ఉపయోగ పడనున్నాయి. అనంతరం ప్రజా ప్రతినిధులు స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించి, సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సత్యానందరావు.





**కొత్తపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం, వాడపాలెం గ్రామం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో 13 వినతలు, ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ఈ అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కారం చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే సత్యానంద రావు పేర్కొన్నారు.

## డయేరియా తో హాస్పిటల్లో చేరిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ఎవ్వరూ కంగారు పడవద్దు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది.



**ఉయ్యూరు, పెన్ సత్తా, ఆగస్ట్ 21:** టౌన్ లోని 5,7 వార్డుల్లో, మండలం లోని ముదునూరు, కడవకొల్లు, బోళ్ల పాడు గ్రామాలకు చెందిన కొంత మంది డయేరియా సమస్యలతో ఉయ్యూరు ప్రభుత్వ హాస్పిటల్లో చేరి వైద్యం చేయించుకుంటున్న సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్ లు మాట్లాడుతూ
గత మూడు రోజులుగా అధికార యంత్రాంగాన్ని ఎప్పటి కప్పుడు సన్నద్ధం చేస్తూ, బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉండాలని ఆదేశించామని తెలిపారు. వాటర్ శాంపిల్స్ కూడా టెస్టింగ్ కోసం పంపించడం జరిగిందని, వీళ్ళందరు కూడా రకరకాల సమస్యలతో హాస్పటల్లో జాయిన్ అవడం జరిగిందని, ప్రభుత్వం బాదితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## విశేష అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 21:** గవరపాలెం శతకం పట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయములో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయ నిర్వాహకులు, శాశ్వత చైర్మన్ కాంద్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి సౌజన్యంతో ఆలయ ప్రధాన అర్చకులు కె హరి నారాయణ, కే శివకేశవ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, మరిడిమాంబ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు.





వాహనాల పార్కింగ్ స్థలాల వివరాలను తెలిపిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 21:** కె.కోటపాడు మండలం, ఎ.కోడూరు గ్రామంలో ఉదయం "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ సిబ్బంది కి ఏర్పాటు చేసి సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు, కార్యక్రమానికి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత మైన ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నేటి (ఆగస్టు 22) ఉదయం 7:00 గంటల నుండి ఎ.కోడూరు మీదుగా ఎటువంటి వాహనాల రాకపోకలను అనుమతించబోరని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ మళ్లింపులు (డైవర్షన్లు):
?పినగాడి నుండి దేవరాపల్లి వెళ్లే భారీ వాహనాలు కొత్తవలస మీదుగా వెళ్ళాలి. దేవరాపల్లి నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలు కొత్తవలస మీదుగా పయనించాలి. దేవరాపల్లి నుండి అనకాపల్లి, చోడవరం వెళ్లే వాహనాలు లంకవానిపాలెం, పింద్రంగి, దాలివలస, రామచంద్రాపురం, కె. కోటపాడు మీదుగా వెళ్ళాలి. వెంకన్నపాలెం నుండి దేవరాపల్లి వెళ్లే వాహనాలు చౌడువాడ నుండి పాచిలవానిపాలెం మీదుగా వెళ్ళవలసిందిగా కోరడ మైనది. కార్యక్రమానికి వచ్చేవారి కోసం పార్కింగ్ ఏర్పాట్లు:?"స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసే ప్రజలు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు.
?వి.మాడుగుల, చౌడువాడ, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, పాసిలవాణిపాలెం, అలాగే సూదివలస, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, కె.కోటపాడు, గొట్లం, పాతవలస గ్రామాల నుండి వచ్చే వారు చోడవరం లేదా కె.కోటపాడు రావాలమ్మ తల్లి గుడి, మెడీచర్ల మీదుగా వచ్చి సూరెడ్డిపాలెం వద్ద ఉన్న లే అవుట్ లో తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి. చీడికాడ, దేవరాపల్లి మండలాల నుండి వచ్చే వారు తురువోలు, ఆలమండ లేదా ఆనందపురం మార్గాల్లో వచ్చి ఎ.కోడూరు లోని రంగరాయ చెరువు వద్ద కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. లంకవానిపాలెం, కొరువాడ, ఆనందపురం, వి.సంతపాలెం, డి.అగ్రహారం, వారడ గ్రామాల ప్రజలు ఎ.కోడూరు లోని గంగరాజు చెరువు వద్ద, దాలివలస, సింగన్నదొరపాలెం వాసులు సూరెడ్డిపాలెం గ్రామం లోని సా మిల్ వద్ద వాహనాలు నిలుపుకోవాలి.
మర్రివలస, శృంగవరం, పింద్రంగి, గవరపాలెం, కే.జే.పురం, కొత్త అగ్రహారం గ్రామాల నుండి వచ్చే వారు ఎ.కోడూరు గవర్నమెంట్ హాస్టల్ ఎదురుగా ఉన్న గాయత్రి స్కూల్ ఆవరణలో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.
ముఖ్య గమనిక: కోటపాడు జంక్షన్ నుండి వారాడ గ్రామం వరకు రహదారి పై ఎటువంటి వాహనాలను నిలపడం పూర్తిగా నిషేధించడ మైనది. ప్రజలందరూ ఈ ట్రాఫిక్ సూచనలను గమనించి, పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం పూజలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 21:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల ప్రాంతాలను నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, కార్యదర్శి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివి ఎస్ మాణిక్యం, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# తాడి గ్రామం తరలింపు పై ముఖ్యమంత్రి



ప్రకటన విడుదలచేయాలి సిఐటియు.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 21:** గత 20 సంవత్సరాలుగా తీవ్ర కాలుష్యంలో అల్లాడుతున్న తాడి గ్రామ తరలింపు పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటనలు ఇచ్చి జీవో ఇచ్చిన అమలుకు నోచుకోలేదని అన్నారు. తర్వాత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని కుటమి నాయకులు మల్ల ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలుపొందిన నేటికీ ఏ విధమైన జీవో గాని స్పష్టమైన ప్రకటన గాని ఇవ్వకుండా గందరగోళ పరుస్తున్నారని అన్నారు.
కాలుష్యంతో ప్రజలు అల్లాడుతున్నారని ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఫార్మా పరిశ్రమల మధ్యన తాడి ఉండడం వలన ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, వెంటనే గ్రామాన్ని తరలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా పోరాటం తప్పదని గనిశెట్టి హెచ్చరించారు.

# ప్రణయ్ తేజ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ.





గల్లంతైన అప్పన్న కుటుంబానికి అండగా ఉంటామని హామీ.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**టౌన్ కొత్త రోడ్డు లిటిల్ గార్డెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రణయ్ తేజ్ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రణయ్ తేజ్ కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులను కలిసి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారిని కోల్పోయిన తల్లిదండ్రుల మనోవేదన వర్ణించలేనిదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. గల్లంతైన అప్పన్న కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ.
అనంతరం 37 వ వార్డు లోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో వేట ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన అప్పన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పన్న గల్లంతైన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి అందాల్సిన సహాయం త్వరగా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, బోట్ అసోసియేషన్ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలి కలెక్టర్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 21:** నేడు (22 న) రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను సకాలంలో, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కె.కోటపాడు మండలం ఏ-కోడూరు గ్రామంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌తో కలిసి హెలిప్యాడ్, రహదారి, సభా వేదిక, ఏ-కోడూరు ఎస్సీ కాలనీలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, ఏపీ కొప్పుల వెలమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి. కుమార్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమావేశ మై అవసర మైన సూచనలు, దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# భోగాపురం ఎయిర్పోర్ట్ లో అదనపు వసూళ్లు ఆపాలి.




- ఆదాయాన్ని పెంచు కోవడానికి ప్రజలను పీక్కు తింటావా? చంద్రబాబు.
- జీఎంఆర్ తో బాబు, లోకేష్ ల లాలూచీ.
- స్థలాలిచ్చిన మత్స్యకారులకు ఒక్క ఉద్యోగం లేదు.
- వలస నాయకులు విశాఖ నుండి కోట్లు సంపాదించారు.
- విశాఖను సర్వనాశనం చేసే హక్కు మీకేక్కడిది.
- స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ ఎందుకు మాట్లాడటం లేదు.
- మేయర్ ఎలక్షన్లో వైసిపి తడాఖా ఏంటో చూపిస్తాం.
- కూటమి నేతల పై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**భోగాపురం ఎయిర్ పోర్టులో అణువణువు ప్రజల నుండి అదనపు వసూళ్లు చేస్తూ పీక్కు తింటారా అంటూ మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ జిఎంఆర్ కి చౌక బేరానికి ముట్ట జెప్పిన కూటమి ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాటాడారు. చంద్రబాబు తోడేలు తెలివితేటలతో జిఎంఆర్ కు
చౌక బేరానికి మా మత్స్యకారుల స్థలాలను అప్పనంగా దోచిపెట్టడమే కాకుండా ఐదు వేల కోట్ల రూపాయలు బ్యాంకుల నుండి సమకూర్చారని అన్నారు. గతంలో ఎయిర్ ఇండియా అథారిటీ గిడ్డింగ్ నుండి కావాలనే తప్పించారన్నారు. మరో మూడు ప్రైవేట్ సంస్థలు పోటీకి వచ్చినప్పటికీ జిఎంఆర్ తో చంద్రబాబు లోకేష్ లు
లాలూచీపడి విశాఖను సర్వనాశనం చేయడమే కాకుండా కేవలం కార్పొరేట్ సంస్థలకు, సోకాల్డ్ నేతలకి దోచుపెడుతున్నారని ఆరోపించారు. అన్ని హంగులు కలిగిన విశాఖ మహానగరం నుండి ఎయిర్ పోర్టును దూరం చేసి ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న అధికారంలో ఉన్న స్థానిక నేతలుగానీ, విశాఖ నుండి కోట్లు సంపాదించిన స్థానికేతర నాయకులు గానీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఎంపీ భరత్ కి విశాఖ చరిత్ర తెలుసా అంటూ మండి పడ్డారు. ఎయిర్పోర్టు రాకముందే అయ్యన్న పాత్రుడు, రాజబాబు లాంటి వారు చౌకగా వందల ఎకరాలు మా మత్స్యకారుల నుండి దోచుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్పోర్ట్ కు అవసర మైన మౌలిక వసతులన్నీ జగన్ మోహన్ రెడ్డి పూర్తి చేస్తే, అధికారం లోకి వచ్చిన చంద్రబాబు జిఎంఆర్ తో ఒప్పందం కుదుర్చుకుని తాను పూర్తి చేసినట్టు డబ్బా కొట్టుకుంటున్నాడని ఆరోపించారు. మత్స్యకారుల నుండి తీసుకున్న స్థలాలతో ఏర్పాటు చేసిన ఎయిర్పోర్టులో వారికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. 5 వేల కోట్ల అప్పు పదేళ్లలో జిఎంఆర్ కు 10 ఏళ్ళల్లోనే వచ్చేస్తుందన్నారు. కానీ ప్రజల నుండి పార్కింగ్ ఫీజుల నుండి ప్రయాణికులు వెళ్లి తిరిగి రావడం ప్రయాణమయ్యే చార్జీలు వరకు దిల్లీ, ముంబై ఎయిర్పోర్టులను మించి 5 రెట్లు వసూలు చేయడం దారుణం అన్నారు. దిల్లీ, ముంబైలలో కేవలం 125 రూపాయలు డిపార్చర్ పాసింజర్ నుండి వసూలు చేస్తే భోగాపురం ఎయిర్పోర్టులో 770 రూపాయలు అదనంగా వసూలు చేయడం విడ్డూరమన్నారు. 700 రూపాయలు బేరానికి వచ్చే టాక్సీ డ్రైవర్లకు రెండు గంటలకు రూ.600 పార్కింగ్ వసూలు ఏమిటని వాసుపల్లి మండి పడ్డారు. ఫ్లైట్ ల్యాండింగ్ పాసింగ్ చార్జెస్ గమనిస్తే బోయింగ్ 747 ఫ్లైట్ 400 మంది ప్రయాణికులను తీసుకువస్తే ఏడు లక్షలు జిఎంఆర్ కి కట్టాలన్నారు. ఇలా 100 ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్, టేక్ ఆఫ్ లతో రోజుకి ఐదు కోట్లు కాగా పది సంవత్సరాలకు 18,250 కోట్లు జిఎంఆర్ కు ఆదాయం సమకూరుతుందన్నారు. అదే కాకుండా కార్గో ల్యాండింగ్స్ చార్జీలు ఇక దేవుడికే ఎరుక అంటూ వాసుపల్లి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పార్కింగ్ పేరుతో వాహనాల నుండి 10 సంవత్సరాలకు అంచనా వేస్తే సుమారు రూ. 600 కోట్లు వసూలు చేస్తున్నారన్నారు. ఇక కమర్షియల్ స్పేస్, డెవలప్మెంట్, హాస్పిటాలిటీ, జిఎంఆర్ బిజినెస్ ఇలా 10 సంవత్సరాలకు కోట్లాది రూపాయలు అదనంగా వస్తున్నాయన్నారు. మా స్థానిక మత్స్యకారులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు లోకేష్ చేస్తున్న దగా పై ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయన్నారు. వైసీపీ అధికారం లోకి వస్తే విశాఖ ఎయిర్పోర్టులో ఉద్యోగాలు పోగొట్టుకున్న వారికి 10 లక్షలు ఇస్తామని తమ అధినేత జగనన్న భరోసా ఇచ్చారనన్నారు. విశాఖపట్నం ఎంత కుట్ర జరుగుతున్న ప్రజలు నమ్మి ఓటు వేసిన పవన్ కళ్యాణ్ ప్రశ్నించకుండా ఎందుకు దూరంగా ఉన్నారన్నారు. కనీసం క్యాబినెట్ సమావేశాలకు కూడా వెళ్లడం లేదని అన్నారు. విశాఖపట్నం కి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని వాసుపల్లి హెచ్చరించారు. విశాఖ ఎయిర్పోర్టును కొనసాగించడమే కాకుండా జిల్లాకు ఒక ఎయిర్పోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బండారు సత్యనారాయణ, అయ్యన్న పాత్రుడు వాళ్ల కుమారుడు విశాఖ ద్వారానే ఉన్నత పదవుల్లో ఉన్నారన్న సంగతి గుర్తుంచు కోవాలన్నారు. గణబాబు, విష్ణు కుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ భరత్ ఇప్పటి కైనా విశాఖ పై జరుగుతున్న అన్యాయం పై నోరు మెదపకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వాసుపల్లి హెచ్చరించారు. మేయర్ ఎలక్షన్లో వైసిపి తడాఖా ఏంటో చూపిస్తామని వాసుపల్లి ఈ సందర్భంగా తెలిపారు.

గూగుల్ ఒక్క పైసా ఇస్తే.. విశాఖ రూపురేఖలు మారిపోతాయి..

దేశంలో ఏ రాష్ట్రం ఒప్పుకోని గూగుల్ సెంటర్ ను ఆంధ్రాలో విశాఖకు చంద్రబాబు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఇప్పటికే నీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారనీ వాసుపల్లి గణేష్ అన్నారు. దిల్లీ కి మించిన పొల్యూషన్ తో ప్రశాంత మైన విశాఖ నాశనం అయిపోతుంది. అయినా సరే విశాఖ ఎంపీ భరత్ కప్పిపుచ్చే మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీఎంసీ అంటే కూడా తెలియని భరత్ హాస్యాస్పద వ్యాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. గూగుల్ డేటాకు 160 కోట్ల లీటర్ల నీరు రోజుకి కావాలన్నారు. గూగుల్ సెంటర్ పది పైసలు ఇస్తే రోజుకి 16 కోట్ల అవుతుంది అన్నారు. విశాఖ అభివృద్ధికి మున్సిపల్ కార్పొరేషన్ ఏడాది బడ్జెట్ 4,500 కోట్లు కేటాయిస్తుంది. అదే బడ్జెట్ కి మించి
ఒక్క పైసా గూగుల్ నుండి వసూలు చేస్తే 4,800 కోట్లు సంవత్సరానికి వస్తాయని వాసుపల్లి అంచనా వేశారు. ఈ బడ్జెట్ తో వసాక రూపురేఖలు మారుతాయి అని, మీకు చేతకాకపోతే వైసీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే చేసి చూపిస్తామని వాసుపల్లి సవాల్ విసిరారు. అప్పనంగా గూగుల్ సెంటర్ కు వేల ఎకరాలు ఇచ్చిన చంద్రబాబు లోకేష్ కి వారి స్వలాభాలు తప్ప విశాఖ అభివృద్ధి కానీ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్టదని వాసుపల్లి గణేష్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ప్రెసిడెంట్ దొడ్డి బాపు ఆనంద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయ్యి డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ లండ రమణ, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, అంబటి అప్పలరాజు, శివ రెడ్డి, చేపల రాజు తదితరులు పాల్గున్నారు.

# రేబాక గూడుపమ్మ తల్లి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



పల్లెల్లో శోభాయమానంగా వరలక్ష్మీ వ్రతాలు


**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 21:** మండలంలో రేబాక గూడుపమ్మ తల్లి ఆలయంలో వరలక్ష్మి దేవి వ్రతం పురస్కరించుకుని శుక్రవారం పెద్ద ఎత్తున మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పల్లెల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం ఆచరించిన మహిళా భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు వందలాది మంది అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ పూజారులు గోత్రనామాలతో ప్రత్యేకంగా అభిషేకాలు జరిపించారు. 108 మందికి వస్త్ర ప్రసాదంగా జాకెట్లు, అమ్మవారి రూపులు, ఒక్కొక్కరికి 9 చామంతి పువ్వులు. 9 గాజులు, 9 పసుపు కొమ్ములు అందజేశారు. అమ్మవారి హారతి అనంతరం భస్మాధారణ కొరకు
స్వచ్ఛమైన దేశీయ గో మయంతో తయారుచేసిన పిడకలు అందజేసారు. ఉదయం నుండి అమ్మవారి ఆలయంలో భక్తులు తాకిడితో ఆలయ ప్రాంగణం దీదీప్యమానంగా వెలిగిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా



నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# మహాలక్ష్మి అవతారంలో భగీరథి అమ్మవారికి విశేష అలంకరణ.

**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 21**: హరిపాలెం, అందలాపల్లి, గ్రామంలో శ్రావణమాస పర్వదినాన్ని పురస్కరించు కొని భగీరథి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో అమ్మవారికి పసుపు కొమ్ములతో విశేషంగా అలంకరించి, 41 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ అమ్మవారి దివ్య కటాక్షంతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు అందరి పై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు మొక్కుకున్నారు.




# ఎన్.నరసాపురంలో అగ్ని ప్రమాదం

కాలి బూడిదైన ఇల్లు, గృహోపకరణాలు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 21:** మండలంలో ఎన్ నరసాపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున2:15గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన సైనబారపు వరహాలు ఇల్లు అనుమాన స్థితిలో ఒకసారిగా మండల వ్యాపించడంతో అగ్నికి పూర్తిగా కాలిపోవడం జరిగింది.అలాగే పక్కనే ఉన్న పోతంశెట్టి త్రిమూర్తులు ఇంటి పైనున్న సోలార్ కూడా పూర్తిగా కాలిపోయింది. బాధితు కుటుంబ సభ్యులు ఇళ్లల్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు, సామాగ్రి ఒకమోటార్ బైక్ కూడా ఈ ప్రమాదంలో కాలి బూడిదయింది. రాత్రి సమయంలో ఫైర్ స్టేషన్ వారికి నక్కపల్లి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా, స్పందించిన ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసారు.



ప్రమాద వివరాలను స్థానిక విఆర్ఓ కి సమాచారం ఇవ్వగా తహసిల్దార్ ఆదేశాలు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆస్తి నష్టాన్ని గుర్తించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 25 కేజీలు బియ్యం,కూరగాయలు అందజేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్, కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మనబాల కొండబాబు, మాజీ సర్పంచ్ లు పల్లా చినబ్బాయి,గట్టెం గణేష్, వంగళపూడి శ్రీను, చొప్పా లోవరాజు, చొప్పా మంగరాజు తదితరులు ఉన్నారు.

# జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అభివృద్ధి పై సమీక్ష.

నియోజకవర్గ అభివృద్ధి అంశాల పై మంత్రి పి. నారాయణతో ఎమ్మెల్యే ల చర్చ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 21:**సిరిపురం లోని వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అభివృద్ధి అంశాల పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లాల ఎంపీ, ఎమ్మెల్యే లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, కొత్త ప్రాజెక్టులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంత్రి పి. నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పై చర్చించారు.

నియోజకవర్గంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని ఎమ్మెల్యే కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పి. నారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఈ నాలుగైదు రోజులే కీలకం!

- ఎస్ఐఆర్ పై వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం
- అనుమానాస్పద, డూప్లికేట్ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి
- అర్హులైన ఓట్లు గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అభ్యంతరాలు తెలిపిన ప్రతిసారీ రసీదులు భద్రపరచుకోవాలి



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. సమగ్ర సవరణలో రెండో విడత కార్యక్రమం దాదాపు పూర్తవుతున్నందున మ్యాపింగ్, నాన్-మ్యాపింగ్, గైర్హాజరు, చిరునామా మార్పులు, డూప్లికేట్, మరణించిన ఓటర్లకు సంబంధించిన సమాచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. పార్టీ ప్రాంతీయ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పరిశీలకులు, రాష్ట్ర స్థాయి నేతలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్ దాఖలు చేసేందుకు నెలాఖరు వరకే గడువు ఉన్నందున పార్టీ యంత్రాంగం వేగవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గత నాలుగైదు నెలలుగా బూత్ స్థాయిలో బీఎల్ఏలు చురుకుగా పనిచేయడం వల్ల అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవడంలో మంచి పురోగతి సాధించామని తెలిపారు. ఓటర్ల సంఖ్య 4.16 కోట్ల నుంచి 3.71 కోట్లకు తగ్గిన నేపథ్యంలో, తొలగింపులకు సంబంధించిన వివరాలను పార్టీ శ్రేణులు నిశితంగా పరిశీలించాలని సూచించారు.

### 17.29 లక్షల అనుమానాస్పద ఓట్లపై నిఘా:

ఇప్పటికే వచ్చిన 44 లక్షల నోటీసుల్లో అనుమానాస్పద అంశాలను గుర్తించి, ప్రతి ఓటును క్షేత్రస్థాయిలో పరిశీలించడం అత్యంత కీలకమని సజ్జల పేర్కొన్నారు. అర్హులైన ఓట్లు తొలగించే పరిస్థితి ఉంటే, వెంటనే సంబంధిత ఫారాలను సమర్పించి వాటిని తిరిగి జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డూప్లికేట్ లేదా బోగస్ ఓట్లుగా భావించిన వాటిపై పక్కాగా అభ్యంతరాలను సమర్పించాలని ఆదేశించారు. చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కూడా అవసరాన్ని బట్టి ఇవ్వాలన్నారు. పార్టీ స్థాయిలో ప్రత్యేకంగా గుర్తించిన సుమారు 17.29 లక్షల అనుమానాస్పద, డూప్లికేట్ ఓట్లను బూత్ స్థాయిలో విధిగా పరిశీలించాలని స్పష్టం చేశారు.

### అభ్యంతరాలకు రసీదు తప్పనిసరి:

ఒకే పేరు లేదా ఇతర వివరాలకు దగ్గరగా ఉన్న ఓటర్లు వాస్తవంగా ఒకరేనా, లేక వేర్వేరు వ్యక్తులా అనే అంశాన్ని బీఎల్ఏలు స్థానికంగా నిర్ధారించుకోవాలని సూచించారు. తమకు చెందిన ఓటు అయితే దాన్ని కొనసాగించేలా, తమకు సంబంధం లేని లేదా డూప్లికేట్‌గా గుర్తించిన ఓటుపై అభ్యంతరం దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్ఏల ద్వారా వచ్చిన సమాచారాన్ని నియోజకవర్గ కోఆర్డినేటర్లు సమీకరించి, సంబంధిత ఈఆర్ఓలకు సమర్పించాలని చెప్పారు. అలా సమర్పించిన ప్రతిసారీ రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని, భవిష్యత్తులో అభ్యంతరాలపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ లేదా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ రసీదులు, పత్రాలు ఆధారాలుగా ఉపయోగపడతాయని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను రానున్న నాలుగైదు రోజుల్లో పూర్తి చేసేలా బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# ఎంపీ అవినాష్ రెడ్డి ఇంట్లో రూ.24 లక్షలు సీజ్!

**లెక్కచూపని నగదును గుర్తించిన ఈడీ**

**ఎంపీ నివాసంలో రెండు లాకర్ల తాళాలు స్వాధీనం**

**రూ.40 కోట్లతో వివేకా హత్యకు కుట్ర ఆరోపణలు**

**కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు సీజ్**

**కడప, ఆగస్టు 21** డప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్కచూపని రూ.24 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రకటించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి శుక్రవారం ఈడీ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఎంపీ నివాసంలో జరిపిన తాజా సోదాల్లో భారీ నగదుతో పాటు రెండు బ్యాంకు లాకర్ల తాళాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. హైదరాబాద్, కడప నగరాల్లోని మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టం చేసింది. వివేకా హత్యకు నెల రోజుల ముందే భారీ కుట్ర జరిగిందని దస్తగిరి విచారణలో వెల్లడించినట్లు ఈడీ తన ప్రకటనలో గుర్తుచేసింది. ఈ దారుణ హత్య కోసం దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఏకంగా రూ.40 కోట్లు ఆఫర్ చేశారని పేర్కొంది. ఆ రూ.40 కోట్లలో వాటా కింద రూ.5 కోట్లు దస్తగిరికి ఇస్తానని ఎర్ర గంగిరెడ్డి ప్రలోభపెట్టారని దర్యాప్తు సంస్థ వివరించింది. ఈ హత్య కేసులో సీబీఐ గతంలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల ఆధారంగానే తాము ఈసీఐఆర్ నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి లోతైన విచారణ జరుపుతున్నామని వివరించింది. తాజా సోదాల్లో నేరానికి సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలను సైతం సీజ్ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సవివరంగా వెల్లడించింది.



# రైతులను ఎండబెడుతున్న బాబు వైఖరి!

**రాయలసీమపై వివక్ష వీడాలన్న గడికోట శ్రీకాంత్ రెడ్డి**

**కరువు హెచ్చరికలున్నా ప్రత్యామ్నాయ ప్రణాళిక శూన్యం**

**శ్రీశైలంలో నీరున్నా పోతిరెడ్డిపాడుకు నామమాత్రపు విడుదలే**

**కీలక రిజర్వాయర్లను ఎండబెట్టి రైతుల పొట్ట కొడుతున్న కూటమి**



రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొంటాయని ఏడాది ముందే హెచ్చరికలు ఉన్నప్పటికీ.. కూటమి ప్రభుత్వం కనీస ప్రత్యామ్నాయ ప్రణాళిక కూడా రూపొందించకుండా రైతాంగాన్ని గాలికొదిలేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సంకుచిత మనస్తత్వం, వ్యక్తిగత కక్షతో రాయలసీమ సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలంలో సరిపడా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పోతిరెడ్డిపాడు ద్వారా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయకుండా కేవలం నామమాత్రపు నీటితో సరిపెడుతున్నారని ఆరోపించారు. గండికోట, గోరకల్లు, వెలుగోడు, సోమశిల, కండలేరు వంటి కీలక రిజర్వాయర్లను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్‌కు సైతం నీరందకుండా చేసి రైతుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. రాయలసీమ ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం చూపుతున్న తీవ్ర వివక్ష వల్ల కరువు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం మొద్దునిద్ర వీడి రైతులకు ప్రత్యామ్నాయ ప్రణాళిక ద్వారా అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూళ్లు

**పోలీసుల అదుపులో ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలు**

**విశాఖపట్నం,ఆగస్ట్20:** ఐరోపా దేశాల్లో ఆకర్షణీయ కొలువుల పేరిట విశాఖ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూలు చేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలిని విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయిన బాధితులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వందల మంది ఉన్నారు. ఇందులో 15 మందిపైగా బాధితులు రూ.70 లక్షల మేర కోల్పోయామంటూ విశాఖ నగరంలోని గురుద్వారా పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విశాఖ పోలీసులు సెర్చ్ వారెంట్‌తో గురువారం కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని నిర్వాహకురాలు సౌజన్య ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడం గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఎంత ప్రయత్నించినా తెరవలేదు. అతికష్టంపై లోపలికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంట్లో ఉన్న బంగారం, వెండి, కొన్ని ఆస్తుల పత్రాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా నుంచి ఆమెను విశాఖకు తీసుకు వస్తున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ పేరుతో సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఓ కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారు. విదేశీయుల పేరుతో ఫేక్ ఈ-మెయిల్స్ పంపి, కొన్ని నకిలీ ఇంటర్వ్యూలు చేయించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెట్టి నిరుద్యోగులకు వల వేశారు. 'తమకు ఉద్యోగాలు వచ్చాయంటూ' సోషల్ మీడియాలో తన గ్యాంగ్‌తోనే కామెంట్లు పెట్టించారు. అది నిజమని నమ్మిన వందలాది మంది నిరుద్యోగులు ఐరోపా దేశాల్లో ఉద్యోగాలు అనగానే రూ.లక్షల్లో తెచ్చి చెల్లించారు. 750 మందిపైగా నిరుద్యోగుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు కృష్ణాజిల్లా పరిధిలో పలుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సౌజన్య, శ్రీనివాసరావు దంపతులను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా విశాఖలో తెరపైకి వచ్చిన బాధితుల ఫిర్యాదుతో బెయిల్‌పై ఉన్న ఆమెను మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఈ బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# మరో 14 రోజులు జైలులోనే..

**ప్రియాంక మృతి కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు**

**సెప్టెంబరు 3 వరకు జస్వంత్, ఆండ్రూలకు రిమాండ్**

**కస్టడీ ముగియడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు**




**రాజమండ్రి, ఆగస్టు 21** పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి కేసులో నిందితులకు కోర్టు రిమాండ్‌ను మరోసారి పొడిగించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన సురవరపు జస్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌లకు 14 రోజుల పాటు (సెప్టెంబరు 3వ తేదీ వరకు) రిమాండ్ విధిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వీరి రెండు రోజుల కస్టడీ పూర్తికావడంతో పోలీసులు వారిని తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలు సిబ్బందికి అప్పగించారు. ఆగస్టు మూడో తేదీన రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద సురవరపు జస్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ మద్యం మత్తులో కారును అతివేగంగా నడిపారు. అదే సమయంలో స్కూటీపై వెళ్తున్న వైద్య విద్యార్థులను ఆ కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కిందపడిన ప్రియాంకను కారుతో పలుమార్లు బలంగా గుద్దేసి అక్కడినుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆమెను పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆగస్టు తొమ్మిదో తేదీన ప్రియాంక ప్రాణాలు కోల్పోయింది. ప్రియాంక మృతి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు శాఖను ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీనియర్ ఐపీఎస్ అధికారి పాటిల్ మనీష్ దేవరాజ్‌కు ప్రభుత్వం అప్పగించింది. కాగా, ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం నిందితులతో పోలీసులు ఘటన స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన సంగతి తెలిసిందే.

# అమరావతిలో వేగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

**తూళ్లూరులో ఆలయ ప్రతిష్టాపనలో పాల్గొన్న మంత్రి నారాయణ**

**అమరావతి,ఆగస్ట్20:** రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29 నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... ఈ ఆలయం నుంచి రైతులు ప్రారంభించిన పాదయాత్ర విజయవంతంగా జరిగిందని చెప్పారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని.. ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతుల ఎ÷-లాట్ల అభివృద్ధి కోసం ఈనెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ఆ తర్వాత వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో వందల ఏళ్లనాటి ఆలయాన్ని గ్రామస్థులు తిరిగి నిర్మిస్తున్నారు. శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాల కోటేశ్వర స్వామివార్ల ఆలయ నిర్మాణానికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తుళ్లూరు శివాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. రాజధాని ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులు ఎంతగానో సహకరించారని తెలిపారు. రాజధాని రైతుల కుటుంబంలో తానూ ఒకడిగా ఉండి పూలింగ్ చేశానని చెప్పుకొచ్చారు.రైతుల త్యాగాలతో తిరిగి అమరావతి రాజధాని అయిందని మంత్రి అన్నారు. ఇదే ఆలయం నుంచి రైతులు న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర ప్రారంభించి విజయం సాధించారని చెప్పుకొచ్చారు. నాటి ప్రభుత్వంలో రైతులు, మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ఎ÷-లాట్‌లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతు న్నాయన్నారు. ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా రాజధానిలో ల్యాండ్ పూలింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, రైల్వే వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్‌పై దృష్టి సారించినట్లు తెలిపారు. 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవే కి కలిపే మూడో విడత నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలందరికీ మంత్రి నారాయణ శుభాకాంక్షలు తెలిపారు.




# అన్నవరం బస్టాండ్‌లో మంత్రి మండిపల్లి ఆకస్మిక తనిఖీ

**కాకినాడ,ఆగస్ట్20:** అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని మహిళలు ప్రశంసలు కురిపించారు. అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదు-పాయాలపైనా మంత్రి ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం అన్నవరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# వరలక్ష్మీదేవిగా అభయమిచ్చిన కనకదుర్గమ్మ

**ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు**

**పలు ఆలయాల్లో శ్రావణ సందడి**

**విజయవాడ,ఆగస్ట్20:** శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరలక్ష్మి దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా దుర్గమ్మ ఆలయంతోపాటు రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కొన్ని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ అమ్మవారు.. భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. భీమవరం మావుళ్లమ్మకు నాలుగు లక్షల గాజులతో అలంకరించారు.శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందుకోసం భక్తులు నాలుగు లక్షల గాజులను సమర్పించారు. నెల్లూరు జిల్లాలో శ్రావణ శుక్రవార పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులు, వజ్రకిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. అటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విశాఖపట్నం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చక్కెర ధరలు పెరిగితే ఏంటి.. అందరికీ షుగరేగా..

- అందరికీ షుగరేగా.. ధర పెరిగితేనేం!
- చక్కెర రేట్లపై బీహార్ మంత్రి వింత లాజిక్
- ధరల మంటకు ఇథనాల్ కారణం కాదు: కేంద్రం
- దిగుబడి తగ్గడమే ప్రధాన కారణం
- మంత్రి తీరుపై విపక్షాల ఆగ్రహం

దేశంలో ఇటీవల చక్కెర ధరలు భారీగా పెరగడంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడం వల్లే వీటి ధరలు పెరిగాయని వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించింది. స్థానికంగా దిగుబడి తగ్గడం, పండుగల వేళ డిమాండ్ పెరగడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని స్పష్టం చేసింది. ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని.. నిల్వలపై పరిమితులు విధించడంతో పాటు దిగుమతులపై సుంకాలను సైతం తగ్గించామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ వెల్లడించింది. దేశంలో జులై ఇరవైవ తేదీన కిలో చక్కెర ధర రూ.48.18గా ఉండగా.. ఆగస్టు ఇరవై నాటికి అది రూ.55.70కి చేరింది. దీంతో ఇథనాల్ తయారీ కోసం చక్కెరను మళ్లించడం వల్లే ఈ స్థాయిలో ధరలు పెరిగాయని విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై కేంద్రం బదులిస్తూ.. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ తయారీ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో పన్నెండు శాతం ఉండగా, 2025-26 నాటికి అది తొమ్మిది శాతానికి తగ్గిందని తెలిపింది. అంచనాల కంటే తక్కువ దిగుబడి రావడం, పండుగల వేళ పెరిగిన డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరాలో అంతరాయం, ఊహాగానాలతో కొందరు అక్రమంగా నిల్వలు పెంచడం తదితర కారణాల వల్లే ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. పైగా, దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడోవంతు మొక్కజొన్న లాంటి ధాన్యాల నుంచే తయారవుతోందని వివరించింది.



### బీహార్ మంత్రి వింత లాజిక్:

దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా చక్కెర ధరలు పెరుగుతున్న క్రమంలో ఈ పరిణామంపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్ ఆసక్తికర, వింత వ్యాఖ్యలు చేశారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ ఉందని.. అందువల్ల పంచదార ధర పెరిగినా పెద్ద ప్రభావం ఏమీ ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రీ-డయాబెటిక్, డయాబెటిక్ కేసులు పెరుగుతున్న కారణంగా ప్రజలు ఎలాగూ చక్కెర వినియోగం విషయంలో జాగ్రత్త పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో చక్కెర ధర పెరిగినా దేశ ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చనేది మంత్రిగారి వ్యాఖ్యల సారాంశం. మధుమేహ రోగుల కేసులు పెరుగుతున్నందున, ప్రజలు స్వీట్లు తినడం లేదని ఆయన సెలవిచ్చారు.

### మండిపడిన ప్రతిపక్షాలు:

విలేకరుల ముందు మంత్రి చేసిన ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఇదెక్కడి లాజిక్' అంటూ నెటిజన్లు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ నేతలు మంత్రి శ్రవణ్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఉదయాన్నే కప్పు టీతో తమ దినచర్యను ప్రారంభించే లేదా బ్రెడ్, బిస్కెట్‌ను టీలో ముంచుకుని తినే సామాన్య ప్రజలు.. పెరుగుతున్న చక్కెర ధరల వల్ల తీవ్ర ప్రభావానికి గురవుతారని ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు. శ్రవణ్ కుమార్ ఒక మంత్రి అయినందు వల్ల.. ఆయన పెరుగుతున్న చక్కెర ధరను సులభంగా భరించగలరని.. అందుకే సామాన్య ప్రజల కష్టాలు, ఆందోళనలు ఆయనకు హాస్యాస్పదంగా అనిపించవచ్చని అహ్మద్ తీవ్రంగా విమర్శించారు.

# ఫలించిన రాహుల్ గాంధీ పోరాటం!

- పెల్లెట్ గన్ కాల్పుల బాధితుడికి అండగా నిలబడ్డ లోక్‌సభ విపక్ష నేత
- పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన
- తలొగ్గి, ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు్

పెల్లెట్ గన్ కాల్పుల బాధితుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పోరాటం ఫలించింది. రాహుల్ ఆందోళనకు తలొగ్గిన కేంద్రం, ఢిల్లీ పోలీసులు.. ఎట్టకేలకు బాధితుడి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జులై ఇరవయ్యవ తేదీన విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద 'చలో పార్లమెంట్' చేపట్టారు. ఆ నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారడంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్‌తో




బలప్రయోగం చేశారు. ఈ పెల్లెట్ గన్ కాల్పుల్లో సాహిల్ లోచబ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతని శరీరంలో 200కు పైగా పెల్లెట్ షెల్స్ దిగబడ్డాయి, ఒక కంటి చూపు కూడా కోల్పోయాడు.

### స్టేషన్ ముందు రాహుల్ బైఠాయింపు:

ఈ దారుణంపై కేసు నమోదు చేయాలని బాధితుడు ఎంత ప్రాధేయపడినా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో అతడు రాహుల్ గాంధీని ఆశ్రయించాడు. గురువారం సాహిల్‌ను వెంటబెట్టుకుని రాహుల్ తొలుత కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు, ఆపై న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ ఉన్న పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. యువకుడి కన్ను పోయినా కేసు నమోదు చేయరా అంటూ పోలీసులపై, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. కేసు నమోదుకు పోలీసులు నిరాకరించడంతో రాహుల్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ శ్రేణులు కూడా భారీగా అక్కడికి చేరుకోవడంతో.. తీవ్ర ఒత్తిడికి తలొగ్గిన ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు సాహిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

## జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21:** హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

### సివిల్ జడ్జి పోస్టులకు మూడేళ్ల అనుభవ నిబంధన సవరణ

### 2027 మార్చి వరకు లా గ్రాడ్యుయేట్లకు అనుభవంతో సంబంధం లేకుండా మినహాయింపు

**న్యూఢిల్లీ:** జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే యువ న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు తీపి కబురు అందించింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గతంలో ఉన్న మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, యువ లా గ్రాడ్యుయేట్లు, మహిళలు, దివ్యాంగులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ సవరణ చేసినట్లు కోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థులకు ఊరటనిస్తూ సుప్రీంకోర్టు కొన్ని కీలక మినహాయింపులను ప్రకటించింది. 2025 మే 20 నుండి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేని లా గ్రాడ్యుయేట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రైనీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులై, ఒక సంవత్సరం స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ శిక్షణతో పాటు మరో సంవత్సరం స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, 2027 ఏప్రిల్ 1 నుండి వచ్చే నోటిఫికేషన్లకు మాత్రం కనీసం ఒక సంవత్సరం యాక్టివ్ ప్రాక్టీస్ అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.




# కారులో తరలిస్తున్న 9కోట్ల నగదు స్వాధీనం

**బెంగళూరు,ఆగస్ట్21:** కర్ణాటక రాజధాని బెంగళూరులో భారీగా నగదు పట్టుబడింది. కారులో తరలిస్తున్న సుమారు రూ.9 కోట్ల నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఈ నగదును పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు నుంచి నగదును తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, సమాచారం ఆధారంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారులో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. నగదును తూత్తుకుడికి తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో సచిన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత.. షావుకారు సినిమాతో పేరు స్థిరం



తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# షావుకారు జానకి మృతికి ప్రముఖుల సంతాపం

## చిరంజీవి, ఎన్టీఆర్, విజయ్‌ల సంతాపప్రకటన

**చెన్నై,ఆగస్ట్21 :** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ' ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పందిస్తూ.. 'తన అద్వితీయమైన నటనతో ఎన్నో తరాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, వేదనకు గురిచేసింది. చిత్ర పరిశ్రమలో 70 ఏళ్లకు పైగా ప్రయాణించి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళా సేవ ఎల్లప్పుడూ కొనియాడదగినది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ వంటి వివిధ భాషా చిత్రాలలో నటించి రికార్డు సృష్టించడంతో పాటు.. పద్మశ్రీ, కలైమామణి, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలను అందుకున్న షావుకారు జానకి మరణం



సినీ రంగానికి తీరని లోటు' అని అన్నారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందిస్తూ.. 'లెజెండరీ నటి షావుకారు జానకి మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె హుందాతనం, గౌరవం, అద్భుతమైన నటనా ప్రస్థానం తరతరాలకూ నిలిచి ఉంటాయి. నేటి యువత ఆమె ఎంతటి గొప్ప మహోన్నతమైన వ్యక్తో తప్పకుండా తెలుసుకోవాలి. ఆమె కుటుంబసభ్యులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అని రాసుకొచ్చారు.



# 15 ఏళ్ల నిరీక్షణకు తెర!

## ప్రపంచ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా సంచలనం

### నాలుగో సీడ్ చైనా జోడీకి షాక్

### మూడు గేమ్‌ల పోరులో అద్భుత విజయం

### మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం

### జ్వాల-అశ్విని తర్వాత రెండో భారత జోడీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్లు గాయత్రి గోపిచంద్-త్రీసా జాలీ చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్న భారత జోడీ.. నాలుగో సీడ్ చైనా ద్వయాన్ని మట్టికరిపించి పతకాన్ని ఖాయం చేసింది. తద్వారా మహిళల డబుల్స్‌లో భారత్‌కు 15 ఏళ్లుగా కొనసాగుతున్న పతక నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన కీలక పోరులో చైనాకు చెందిన జియా యి ఫాన్-జాంగ్ షు షియాన్ జోడీతో గాయత్రి-త్రీసా అమీతుమీ తేల్చుకున్నారు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను భారత జోడీ 16-21తో కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. రెండో గేమ్‌లో దూకుడు పెంచి 21-15తో చైనా జోడీని చిత్తు చేసి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో భారత అమ్మాయిల జోరు ముందు చైనా జోడీ నిలువలేకపోయింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన గాయత్రి-త్రీసా 21-13తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. నాలుగో సీడ్ జోడీని ఓడించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో భారత మహిళల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా కొత్త అధ్యాయం లిఖించారు. 2011లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప జోడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత మహిళల డబుల్స్‌లో భారత్‌కు మరో పతకం దక్కలేదు. ఇప్పుడు 15 ఏళ్ల తర్వాత గాయత్రి-త్రీసా ఆ నిరీక్షణకు తెరదించారు. అంతకుముందు కూడా భారత జోడీ సంచలన ప్రదర్శన చేసింది. వరుసగా ఉన్నత సీడ్ జోడీలను ఇంటిముఖం పట్టిస్తూ పతక పోరుకు చేరింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమిస్తూ గాయత్రి-త్రీసా కనబరిచిన పోరాట పటిమ భారత బ్యాడ్మింటన్‌లో మరో చారిత్రక విజయానికి బాటలు వేసింది.

# రెండో టెస్టుకు లంక కొత్త అస్త్రాలు

## జట్టులోకి మిషారా, ఆరాచ్చిగే

- గాయాలతో ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- మెండిస్, నిస్సాంక, చాండిమాల్‌కు విశ్రాంతి
- తొలి టెస్టు ఓటమికి బదులు తీర్చుకోవాలని లంక
- సిరీస్ క్లీన్‌స్వీప్‌పై భారత్ కన్ను



**కొలంబో:** భారత్‌తో జరిగే రెండో టెస్టుకు శ్రీలంక కీలక మార్పులతో సిద్ధమవుతోంది. గాయాలతో పలువురు ప్రధాన ఆటగాళ్లు దూరం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను జట్టులోకి తీసుకుంది. ఆగస్టు 23 నుంచి కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. కుశాల్ మెండిస్ గాయం కారణంగా దూరం కాగా, పాథుమ్ నిస్సాంక పూర్తిస్థాయిలో కోలుకోలేదు. గాలే టెస్టులో కన్‌కషన్‌కు గురైన దినేశ్ చాండిమాల్ కూడా రెండో టెస్టుకు అందుబాటులో ఉ ండటం లేదు. కీలక బ్యాటర్లు ముగ్గురు దూరం కావడంతో శ్రీలంక బ్యాటింగ్ విభాగంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి వీరిద్దరిలో ఒకరికి లేదా ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. భారత్ వంటి బలమైన ప్రత్యర్థిపై అవకాశం లభిస్తే తమ ప్రతిభను నిరూపించుకునేందుకు వారికి ఇదో కీలక వేదిక కానుంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఇప్పుడు కొలంబోలోనూ అదే జోరు కొనసాగించి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు సొంతగడ్డపై సిరీస్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే శ్రీలంకకు రెండో టెస్టులో విజయం తప్పనిసరిగా మారింది. ధనంజయ డి సిల్వా నాయకత్వంలోని శ్రీలంక జట్టులో లహిరు ఉదారా, కమీల్ మిషారా, పసిందు సూరియబండారా, కమిందు మెండిస్, సహన్ ఆరాచ్చిగే, సోనల్ దినూషా, నిరోషన్ డిక్వెల్లా, కేశర సువాన్థా, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అసిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో చోటు దక్కించుకున్నారు. కీలక ఆటగాళు లేకుండానే భారత్‌ను నిలువరించాల్సిన పరిస్థితి రావడంతో కొలంబో టెస్టు శ్రీలంకకు అసలైన పరీక్షగా మారనుంది.

# యూఎస్ ఓపెన్‌లో కనకవర్షం!

- చరిత్రలోనే భారీ ప్రైజ్‌పూల్
- మొత్తం పరిహారం రూ.వెయ్యి కోట్లకు చేరువ
- సింగిల్స్ విజేతకు రూ.52.65 కోట్లు
- ఆగస్టు 23 నుంచి గ్రాండ్‌స్లామ్ సమరం
- అల్కరాజ్ పునరాగమనంపై అందరి చూపు




**న్యూయార్క్:** టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్‌లలో ఒకటైన యూఎస్ ఓపెన్-2026 రికార్డు స్థాయి ప్రైజ్‌మనీతో సరికొత్త చరిత్రకు సిద్ధమైంది. ఈసారి ఆటగాళ్లకు అందించే మొత్తం పరిహారాన్ని 108 మిలియన్ డాలర్లకు పెంచారు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే ఇది భారీ మొత్తంగా నిలవనుంది. 2024తో పోలిస్తే ఏకంగా 44 శాతం పెరుగుదల నమోదైంది. పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్లకు భారీ నజరానా ఎదురుచూస్తోంది. ఒక్కో సింగిల్స్ విజేతకు సుమారు రూ.52.65 కోట్ల నగదు బహుమతి దక్కనుంది. గత ఏడాదితో పోలిస్తే విజేతలకు అందించే ప్రైజ్‌మనీని 10 శాతం పెంచారు. దీంతో టైటిల్‌తో పాటు భారీ చెక్కు కోసం కూడా అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ ఈ భారీ ప్రైజ్‌మనీ వివరాలను ప్రకటించింది. ఆటగాళ్లపై పెట్టుబడులను మరింత పెంచే దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆటగాళ్లు, అభిమానులు, భాగస్వాములకు యూఎస్ ఓపెన్‌ను మరింత విలువైన వేదికగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. యూఎస్ ఓపెన్ ప్రధాన పోటీలు ఆగస్టు 23న ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 13న పురుషుల సింగిల్స్ ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్లు బరిలోకి దిగనుండటంతో టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మరోవైపు స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్‌పైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మణికట్టు గాయం కారణంగా కొంతకాలంగా పోటీ టెన్నిస్‌కు దూరంగా ఉన్న అల్కరాజ్ యూఎస్ ఓపెన్‌తో పునరాగమనం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గాయం నుంచి కోలుకుని అతడు ఏ స్థాయిలో రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. రికార్డు ప్రైజ్‌మనీ.. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్ల పోరు.. టైటిల్ కోసం ఉత్కంఠభరిత సమరం.. ఇలా యూఎస్ ఓపెన్-2026 టెన్నిస్ అభిమానులకు భారీ విందుగా మారనుంది.

# కంగారొద్దు.. అతడు మా మ్యాచ్ విన్నరే: సాయిరాజ్ బహుతులే



శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ అద్భుత విజయం సాధించింది. మానవ్ సుతార్, రవీంద్ర జడేజా నాణ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. సీనియర్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపించలేదు. కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడికి తప్పిస్తారనే ప్రచారం సాగుతోంది. యువ బౌలర్ సారాంశ్ జైన్‌కు అవకాశం ఇస్తారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే చేసిన వ్యాఖ్యలతో కుల్‌దీప్ యాదవ్‌కు రెండో టెస్టులోనూ అవకాశం ఖాయమని స్పష్టమైంది.

“తొలి టెస్టులోనూ కుల్‌దీప్ బాగానే బౌలింగ్ చేశాడు. వికెట్లు తీసే అవకాశాలను సృష్టించాడు. గాలెలో అతడి పాత్ర భిన్నమైంది. అందులో సక్సెస్ అయ్యాడు. అతడు టీమ్ఇండియా మ్యాచ్ విన్నర్. తప్పకుండా రాబోయే మ్యాచ్‌లో చేసి చూపిస్తాడు. ఫింగర్ స్పిన్నర్లతో పోలిస్తే రిస్ట్ స్పిన్నర్లు బంతి కాస్త సాఫ్ట్‌గా మారిన తర్వాత ఇబ్బంది పడటం సహజం. ఫింగర్ స్పిన్నర్లు తేలికగా హ్యాండిల్ చేయగలరు. ఎడమచేతివాటం రిస్ట్ స్పిన్నర్ అయిన కుల్‌దీప్ యాదవ్‌కు తొలి టెస్టులో అదే సమస్యగా మారింది. ఏదో ఒక మ్యాచ్‌లో ఎక్కువగా వికెట్లు తీయనంత మాత్రాన అతడి ప్రదర్శనపై ఓ నిర్ణయానికి రాలేం” అని సాయిరాజ్ (ఘ్ఖఅత్ఘుయి దీఘ్పష్ట్రబ్‌బశ్రీవ) స్పష్టం చేశారు.

సుతార్ నమ్మకమైన ప్లేయర్అఫ్గానిస్థాన్‌పై తొలి టెస్టులోనే ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్ (మ్ఘిఅఘ్జ రాబ్‌ష్ఘ్ఘుతీ).. ఇప్పుడు శ్రీలంకపై పది వికెట్ల ప్రదర్శన చేశాడు. సుతార్ బౌలింగ్ ప్రతిభపై సాయిరాజ్ మాట్లాడుతూ.. “సుతార్ బౌలింగ్ తీరు రోజురోజుకీ మెరుగవుతోంది. బంతిపై చాలా ఒత్తిడి తెస్తాడు. బౌలింగ్‌లో వైవిధ్యం చూపిస్తాడు. మాకు నమ్మకమైన ఆటగాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో వికెట్ తీసే నైపుణ్యం ప్రదర్శించాడు. అయితే, మున్ముందు అతడిపై ఒత్తిడి లేకుండా చూసుకుంటాం. సుతార్ బలం ఏంటో గుర్తించి దానిని మరింత మెరుగ్గా చేసేందుకు చూస్తాం” అని బహుతులే వెల్లడించారు.

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?







విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన ‘కింగ్డమ్’తో బలంగా పుంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది.ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన. వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు.‘రణబాలి’ వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు ‘రౌడీ జనార్ధన’ సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. ‘రణబాలి’ ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు ‘రౌడీ జనార్ధన’ వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రిలీజ్ అవుతాయి. ‘హాయ్ నాన్న’ ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com